నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ చందమమా ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాచారం పారిశ్రామికవాడ రోడ్‌నెంబర్ 09, చందమామ ప్రెస్‌లైన్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11 కేవీ దుర్గానగర్ ఫీడర్‌పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐడీఏ నాచారం రోడ్‌నెంబర్ 18 ఏరియా, 11 కేవీ టెక్ పార్క్ పరిధిలో రోడ్ నెంబర్ 12,15,జీవికే లైన్ ఐడీఏ నాచారంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి లబ్ధిదారులు క్రాంతి కిషోర్, తాహేరా బేగం, ఫాతిమా షహేనాలకు అందజేశారు. నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, మహేష్‌యాదవ్, వీఎస్.ప్రకాష్ రెడ్డి, జాఫర్ తదితరులున్నారు.

ఇఫ్తార్‌లు మతసామరస్యానికి ప్రతీకలు



ఇఫ్తార్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్‌లో షేక్ మగ్దూమ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిహంత్రిరెడ్డి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. వినాయక కౌతం, ఆనందనర్తన, గజవదాన, అయిగిరి నందిని, అన్నమాచార్య కీర్తన, రామదాసు కీర్తన తదితర అంశాలను తపస్య, శాన్వీ, అనిత, అశ్విని, జ్యోతి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఉప్పల్ డివిజన్ బీజేపీ నేతల రాజీనామా

ఉప్పల్: డివిజన్ నూతన అధ్యక్షుడి ఎన్నిక ఏకపక్షంగా నిర్వహించారని ఆరోపిస్తూ దీనికి నిరసనగా ఉప్పల్ డివిజన్ బీజేపీ నాయకులు, సీనియర్ నాయకులంతా మూకుమ్మడిగా తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా ఎన్నికల కమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. తామంతా ఏకాభిప్రాయానికి వచ్చి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

ముంచెత్తిన వాన

ఇళ్లలోకి చేరిన వరద నీరు

మల్లాపూర్: శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షం కారణంగా కాలనీల్లోకి వరద నీటితో ముంచెత్తింది. నాలాకు అడ్డుగా గుర్రపుడెక్క మట్టి పడటంతో సాఫీగా వెళ్లాల్సిన వరద ఒక్కసారిగా నాలాకు సమీపంలోని అంబేడ్కర్‌నగర్‌కు వరదనీరు చేరింది. దీంతో ఇళ్లలోని వారందరూ బయటికొచ్చారు. పేదల నిత్యవసర సామగ్రి, ఫర్నిచర్, తదితర వస్తువులు నీట మునిగాయి. స్థానిక కాంగ్రెస్ నేత రాజు బాధితులకు ఆహారం అందజేశారు.

బురదమయంగా వీధులు..

కుషాయిగూడ: అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అతలాకుతలం చేసింది. లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. పార్కులు, ఆటస్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. సాయినగర్ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లడంతో రోడ్లన్నీ బురదతో నిండిపోయాయి. వాహనదారులు, స్థానికులు బయటకు వెళ్లలేని పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి సాయినగర్ మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.





బురదమయంగా సాయినగర్ కాలనీ రోడ్లు



వరద నీటిలో అంబేడ్కర్‌నగర్ కాలనీ



వరద ఉధృతికి బయటికొచ్చిన కాలనీవాసులు

ఉప్పల్- నారపల్లి ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయాలి

మేడిపల్లి: నారపల్లి ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులను పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం చెంగిచెర్ల చౌరస్తా నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రలో సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ఈ ఫ్లై ఓవర్-2018 జులైలో ప్రారంభించిన పనులను 2020 జులై నాటికి పూర్తి చేయాలని అప్పట్లో నిర్ణయించారు. సుమారుగా రూ.670 కోట్లతో దీన్ని ప్రారంభించారు. నిర్మాణ సంస్థ ఇప్పటివరకు 43శాతం పనులు మాత్రమే చేసి నిలిపేసిందని, అసంపూర్తి పనులతో ఈ మార్గంలో వాహనదారులకు నరకప్రాయంగా మారిందన్నారు. ఏడేళ్లగా కొనసాగుతున్న పనుల కారణంగా వాహనదారులు ప్రమాదాల్లో తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షత గురించి మాట్లాడటం లేదన్నారు. తక్షణమే ఎంపీ ఈటల రాజేందర్ ఈ ప్రాంత అభివృద్ధి కోసం పనులు పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లై ఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని, లేదంటే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్, కోమటి రవి, వినోద్, ఎర్ర అశోక్, శ్రీనివాసులు, రాజశేఖర్, సీపీఎం పార్టీ జిల్లా సభ్యులు వెంకన్న, రాథోడ్‌సంతోష్, లింగస్వామి, నరేష్, సబిత, లక్ష్మణ్, సీపీఎం నాయకులు చింతల యాదయ్య, శ్రీమన్ నారాయణ, మేడిపల్లి మండల కార్యదర్శి సృజన, శారద,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్, మల్కాజిగిరి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

మల్కాజిగిరి: ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులపై నిరంతరం అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పార్టీ కార్పొరేటర్లు, నాయకులకు సూచించారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలు, బాక్స్ డ్రైన్ల నిర్మాణం, వేసవిలో నీటి ఎద్దడి, కొత్త రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డివిజన్లలో ఉన్న నాయకులు, పార్టీ కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుని పనులు జరిగేలా చూసుకోవాలన్నారు. పార్టీని బలోపేతం చేయడమే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్పొరేటర్లు విజయశాంతిరెడ్డి, సబితాకిషోర్, సునీతాయాదవ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

వెనుకబడిన వర్గాలకు అండగా ఉండాలి

మల్లాపూర్: దళితులు, వెనుకబడిన పేదవర్గాల అభివృద్ధికి నిరంతరం పేదల పక్షాన నిలబడి పోరాటం చేయాలని సీపీఎం పార్టీ కార్యదర్శి జాన్‌వెస్లీని దళిత జనసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి అన్నారు. శనివారం జాన్‌వెస్లీతో ఆయన సమావేశమై అనంతరం సత్కరించారు. దళిత జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, కార్యదర్శి గంగాధర్, సంపత్, అశోక్, క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



జాన్‌వెస్లీని సత్కరిస్తున్న బొజ్జ యాదగిరి

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుషాయిగూడ: ట్రినిటీ ఆసుపత్రి సహకారంతో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రినిటీ ఆసుపత్రి వైద్య బృందం బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌తో పాటు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, చల్ల ప్రభాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బింబదర్శినిలో వెంకన్న స్వామి

మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శనివారం ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 11,000లకు పైగా చిన్నచిన్న అద్దాలతో స్వామివారిని అలంకరించారు. స్వామి బింబదర్శిని రూపంలో దర్శనమివ్వగా.. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

– మల్కాజిగిరి



సీసీరోడ్డు పనులు ప్రారంభం



తిరుమలనగర్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్‌కాలనీలో శనివారం కార్పొరేటర్ ప్రభుదాస్ సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. స్థానికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన చర్యలు తీసుకుని పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. కాలనీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, చంద్రశేఖర్, మురళీకృష్ణ, గణేష్, సదానందం, గుప్తా నారాయణ, రాజేశ్వరరావు, రామకృష్ణ, మధుప్రసాద్ పాల్గొన్నారు.

జనావాసాల్లో సెల్‌టవర్‌ను తొలగించాలి

అల్వాల్: జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్‌ను తొలగించాలని కోరుతూ శక్తి గణేష్ నగర్ కాలనీవాసులు శనివారం అల్వాల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఇళ్ల మధ్య సెల్‌టవర్ నిర్మించడం వల్ల దాని ద్వారా వచ్చే రేడియేషన్ కారణంగా కాలనీవాసులు అనారోగ్యాల భారిన పడుతున్నారని, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. శక్తి గణేష్‌నగర్ కాలనీవాసులు శ్రీనివాస్, రాములు, రాంచందర్, రవి, సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

సొంత నిధులతో అభివృద్ధి పనులు

మల్లాపూర్: నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ సొంత నిధులతో డివిజన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నారు. హెచ్‌ఎంటీనగర్ పెద్దచెరువు, ఇందిరానగర్ మార్గంలో ఏపుగా పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు, మట్టికుప్పలతో రోజూ ఉదయం వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక కార్పొరేటర్ సొంత నిధులు ఖర్చుచేసి సమస్యను పరిష్కరించారు. బీఆర్ఎస్ నేతలు విఠల్‌యాదవ్, యాదగిరి, పరమేష్, రాజు తదితరులున్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు కేటాయించండి

అల్వాల్: అల్వాల్ డివిజన్ గంగపుత్ర కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని శనివారం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఎస్సీ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అల్వాల్‌లో ఉన్న లేక్‌లోని వ్యర్థాలను తొలగించాలని కోరారు. దీనిపై సానుకులంగా స్పందించిన ఆయన కమ్యూనిటీహాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజురు చేయిస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.

ఐపీఎల్ బ్లాక్ టికెట్ల విక్రయం కలకలం!

ఉప్పల్: ఉప్పల్‌లో ఆదివారం జరుగనున్న సన్‌రైజర్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల బ్లాక్ దందా మొదలైంది. టికెట్ల బ్లాక్ దందాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్ బాబు ప్రకటించి 24 గంటలు గడవక ముందే విక్రయదారులు సీపీకి సవాలు విసురుతూ స్టేడియం అవరణలోనే బ్లాక్ దందాకు తెరలేపారు. శనివారం ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఐపీఎల్ మ్యాచ్ టికెట్లను విక్రయిస్తున్న భరద్వాజ్‌ను ఎల్‌బీ నగర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి దాదాపుగా 10 టికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఐదు టికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. తదుపరి విచారణకు ఉప్పల్ పోలీసులకు నిందితులను అప్పగించినట్లు పేర్కొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

గౌతంనగర్: డివిజన్‌లో పవర్‌బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తామని కార్పొరేటర్ సునీతాయాదవ్ అన్నారు. ఇందిరానెహ్రూనగర్‌లో పర్యటించిన ఆమె పవర్ బోర్లకు సొంతనిధులతో మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు.

న్యాయసాయంపై ఖైదీలకు అవగాహన

కుషాయిగూడ: ఖైదీలకు న్యాయసాయంపై శనివారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జస్టిస్ బాల భాస్కరరావు, సెక్రటరీ జస్టిస్ కిరణ్‌కుమార్‌లు హాజరై ఖైదీలకు న్యాయసాయంపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్ ఖైదీలతో ముఖాముఖి వారి హక్కులను వివరించారు. అవసరమైన ఖైదీలకు ఉచిత న్యాయసాయం అందిస్తామని చెప్పారు. న్యాయసాయం కావాలనుకునే ఖైదీలు న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలు పర్యవేక్షణాధికారి రామచంద్రం, ఉప పర్యవేక్షణాధికారి, శశికాంత్, రత్నం పాల్గొన్నారు.



చర్లపల్లి జైలులో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జస్టిస్ బాల భాస్కరరావు

బెట్టింగ్ గేమ్ ప్రచారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అల్వాల్: బెట్టింగ్ గేమ్ ప్రచారకులు, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఏసీపీ మహేష్‌కు ఫిర్యాదు చేశారు. నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అనంతరం మాట్లాడుతూ.. మెదక్, రామాయంపేట్ తదితర ప్రాంతాల్లో బెట్టింగ్ యాప్‌ల కారణంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలు చాలా ఉన్నాయన్నారు. ఈ యాప్‌లు నడిపించే వారి వెనుక ఎంతటి వారు ఉన్నా కఠినచర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్రంలో గంజాయి విక్రయదారులు, గ్యాంగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ స్థానిక నేతలు పాల్గొన్నారు.



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

విజేతలుగా నిలిచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు

రామంతాపూర్ : ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంజినీరింగ్ ప్రాజెక్టు ప్రెజెంటేషన్ పోటీల్లో రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విద్యార్థులు ప్రథమ బహుమతిని పొందారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎ.వెంకటరమణ మార్గదర్శకంలో సెకండ్ ఇయర్ విద్యార్థులు పూర్ణశేఖర్ ఆర్యన్, అభిషేక్ స్మార్ట్ హోమ్, సెక్యూరిటీ సిస్టమ్, రియల్ టైమ్ ప్రాజెక్ట్ రూపొందించారు. ఈ మేరకు శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ ఫైబర్ గ్రేడ్ ఎండీ.వేణు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విభాగాధిపతి మల్లికార్జున్ అభినందించారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జెడ్సీని కోరారు. శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవిలో బ్యాక్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వీలైనంత త్వరలో పెండింగ్ పనులకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బన్నాల గీతాప్రవీణ్, బీఆర్ఎస్ నేతలు తదితరులున్నారు.



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కుషాయిగూడ పారిశ్రామికవాడలో పేలుడు..

ఒకరి మృతి, ప్రాణాలతో బయటపడ్డ మరో వ్యక్తి

కుషాయిగూడ: కుషాయిగూడ పారిశ్రామికవాడలో పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, పెద్ద దర్పల్లికి చెందిన సాడక్ నాగరాజు (37) కొన్నేళ్ల క్రితం భార్యతో కలిసి నగరానికి వచ్చాడు. నేరేడ్‌మెట్, నిర్మల్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం కుషాయిగూడ పారిశ్రామికవాడలోని లక్కీ స్టీల్ సమీపంలో చెత్త కుప్పను ఎత్తేందుకు ట్రాక్టర్ యజమాని రాజశేఖర్‌తో కలిసి కూలీగా వచ్చాడు. ఒక ట్రిప్ చెత్తను తీసుకెళ్లి రెండో ట్రిప్ లోడ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు దూరంగా ఎగిరిపడ్డ నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి శరీర భాగాలు తెగిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అప్పటి వరకు నాగరాజుతో మాట్లాడుకుంటూ ఉన్న రాజశేఖర్ అక్కడ నుంచి పక్కకు వెళ్లిన క్షణాల్లోనే పేలుడు సంభవించిందని, తృటిలో ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డానంటూ రాజశేఖర్ కన్నీటి పర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడి భార్య లావణ్య ప్రస్తుతం గర్భవతని తెలిసింది. భర్త మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.




ఘటనా స్థలంలో నాగరాజు మృతదేహం, వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పేలుడుకు కారణమేమిటి.. ?

పారిశ్రామికవాడలో చోటు చేసుకున్న పేలుడుపై మొదట్లో స్పష్టత రాలేదు. సాయి కాంప్లెక్స్ వద్ద చాలా రోజులుగా పేరుకుపోయిన వ్యర్థాలను ఎత్తేస్తున్న క్రమంలో ఈ పేలుడు సంభవించింది. పేలుడు జరిగిన పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో అంతా ట్రాన్స్‌ఫార్మర్ పేలిందనుకున్నారు. కానీ ఘటనా స్థలాన్ని సందర్శించిన ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ వల్ల కాదని తేల్చారు. చెత్త తీస్తున్న క్రమంలో చెత్తలోని రసాయనాలు, పేలుడు పదార్థాల వల్లే పేలుడు జరిగి ఉంటుందని పోలీసులు అంచనాకు వచ్చారు. దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

డంపింగ్ యార్డును తొలగించాలి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హిందూ శ్మశానవాటికలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. స్థానికుల విజ్ఞప్తితో ఆయన డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. శ్మశానవాటికలో తాత్కాలికంగా ఏర్పాటు చేశామని చెబుతూ శాశ్వత నిర్మాణం చేపడుతున్నారని ఎంపీకి వివరించారు. కాలనీవాసులకు అండగా ఉంటామని డంపింగ్ యార్డు తొలగించడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ రజని, ప్రభాకర్, మాణిక్యరెడ్డి, మల్లికార్జున్, గోపి తదితరులున్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీ ఈటల